క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని 11కేవీ టౌన్ ఫీడర్-4, టౌన్ ఫీడర్-3 మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ టౌన్ ఏఈ శివకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్ బోర్డు, భీంనగర్, 2వ రైల్వే గేటు, బీరెల్లి రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, అంబేడ్కర్ చౌక్, వీవర్స్ కాలనీ, నల్లకుంట, లింగంబాగ్ కాలనీ, చింతలపేట, నది అగ్రహారం, న్యూబస్టాండ్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగ దారులు సహకరించాలని కోరారు.

2815 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

ఉండవెల్లి: మండలంలోని పత్తి కొనుగోలు కేంద్రంలో సీసీఐ ద్వారా గత మూడు రోజుల్లో 87 మంది రైతుల వద్ద 2815.80 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు బుధవారం మార్కెట్ యార్డ్ సెక్రటరీ యల్లస్వామి తెలిపారు. రైతులు పంటలకు సంబంధించిన పత్రాలు అందజేసి నాణ్యమైన పత్తి తీసుకురావాలని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థిని



కేటీదొడ్డి: ఈ నెల 5న మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన 68 ఎస్‌జీఎఫ్ జోనల్ అథ్లెటిక్స్ అండర్-17 బాలికల విభాగం షాట్‌పుట్ పోటీల్లో కేటీదొడ్డి కేజీబీవీ విద్యార్థిని అలైఖ్య ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు బుధవారం ఎస్‌ఓ పద్మావతి, పీఈటీ అరుణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయలు, సిబ్బంది తదితరులు అభినందించారు.

ప్రతిభ కనబరిచిన కేజీబీవీ విద్యార్థి

అయిజ: జోన్ లెవల్ 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్ ఈవెంట్స్‌లో మహబూబ్‌నగర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన అండర్- 17 విభాగం జావెలిన్‌త్రో పోటీల్లో అయిజ కేజేబీవీకి చెందిన విద్యార్థిని హర్షిత మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా అధికారుల చేతుల మీదుగా మెడల్, సర్టిఫికెట్ అందుకుంది. ఈ నేపథ్యంలో బుధవారం కేజీబీవీలోని ఎస్‌ఓ, సీఆర్‌టీలతో పాటు వివిధ పాఠశాలల పీఈటీలు హర్షితను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నివారణ టీకాలు తప్పనిసరి

మల్దకల్: రైతులు తమ పాడిపశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారులు యామినీ సాయి, విజయ్‌కుమార్‌లు అన్నారు. బుధవారం మల్దకల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ, లింగ నిర్ధారణ, కృత్రిమ గర్భధారణ, చూలు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మొత్తం 512 పశువులకు ఉచితంగా టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రాజేంద్ర, ప్రగతి, అర్జున్ సింగ్, రామాంజనేయులు, రాము, రామేశ్వరయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

డీటీగా శివశంకర్ బాధ్యతలు స్వీకరణ



గట్టు: డిప్యూటీ తహసీల్దార్‌గా శివశంకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కేటిదొడ్డి మండలంలో పనిచేస్తున్న శివశంకర్ గట్టుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న రవికుమార్ బదిలీ అనంతరం డీటీ పోస్టు ఖాళీగా ఉండటంతో జిల్లా అధికారులు భర్తీ చేశారు. ఈ సందర్భంగా శివశంకర్‌కు తహసీల్దార్ సరితారాణి, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

మోసగాడిపై కేసు నమోదు

ధరూరు: మండల కేంద్రంలో మంగళవారం చికెన్ సెంటర్, హార్డ్‌వేర్ షాప్, సిమెంట్ షాపుల్లో ఫోన్ పే చేస్తానని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేసి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షుకూర్ తెలిపారు. ధరూరులో లభించిన సీసీటీవీ ఫుటేజీలతో పాటు జెమ్మిచేడు వద్ద బుధవారం సిమెంట్ షాప్‌లో మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నించగా.. సదరు వ్యాపారి పట్టుకుని పోలీసులకు సమాచారం అందజేశారన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పారదర్శకంగా కుటుంబ సర్వే



తాటికుంటలో కుటుంబ సమగ్ర సర్వే పరిశీలిస్తున్న డీపీఓ శ్యాంసుందర్

ఉండవెల్లి(మానవపాడు): సమగ్ర కుటుంబ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్‌లో..

మల్దకల్: మండలంలోని అమరవాయి, తాటికుంట, మల్దకల్, పెద్దపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను డీపీఓ శ్యాంసుందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి ఇంటికి ఎన్యుమరేటర్లు వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ఎలాంటి తప్పులు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందుగా గ్రామాల్లో ప్రతి ఇంటికి స్టిక్కర్లు అతికించాలన్నారు. స్టిక్కర్లు అతికించిన ఇళ్లకు వెళ్లి అధికారులు వివరాలు సేకరించేందుకు సులువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలూరులో..

గట్టు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే బుధవారం అధికారులు ప్రారంభించారు. ఆలూరు గ్రామంలో సర్వేను ప్రత్యేక అధికారి గోవిందయ్య, ఎంపీడీఓ చెన్నయ్య పరిశీలించారు. సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు ప్రతి కుటుంబాన్ని సందర్శించి స్టిక్కర్‌ను అతికించాలని సూచించారు. ఎన్యుమరేటర్లకు సర్వేలో నెలకొన్న సందేహాలను ప్రత్యేక అధికారి నివృత్తి చేశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఉండవెల్లిలో..

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో కుటుంబ సర్వేలో 51 మంది అధికారులు పాల్గొన్నారు. బుధవారం ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు సర్వే నిర్వహించారు. ఇంటింటి సర్వేలో భాగంగా మొదటి రోజు ఇళ్లు పర్యవేక్షించి 10వ తేది నుంచి పూర్తి సమాచారాన్ని నమోదు చేస్తారని ఎంపీడీఓ తిరుపతన్న



జింకలపల్లిలో సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేష్

తెలిపారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో తప్పులు దొర్లొద్దు..

కేటీదొడ్డి: కుల గణన సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా కొనసాగించాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని కేటీదొడ్డి, మెలగడ్డ, రంగాపురం, నందిన్నె, కొండాపురం, గువ్వలదిన్నె, కుచినెర్ల తదితర గ్రామాల్లో హౌస్‌లిస్టల తయారీ, స్టిక్కరింగ్ ప్రక్రియ పరిశీలించి పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేపై అవగాహన కార్యక్రమం..

ఉండవెల్లి(మానవపాడు): మండలంలోని మద్దురు గ్రామంలో జిల్లా కలెక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో ఇంటింటి కుటుంబ సర్వేపై సాంస్కృతిక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. సర్వే జయప్రదం చేయాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో కేశవులు, ప్రసాద్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

కుల గణనకు సహకరించాలి..

ఇటిక్యాల: ప్రభుత్వం ప్రతిష్టాతక్మకంగా చేపడుతున్న కుల గణన సర్వేకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ నరేందర్ అన్నారు. బుధవారం ఇటిక్యాల మండల కేంద్రంతో పాటు నక్కలపల్లిలో ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్వేలో ప్రతి ఒక్కరూ సరైన సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే చేపట్టాలి..

ఎర్రవల్లి: ప్రభుత్వం ప్రతిష్టాతక్మకంగా చేపడుతున్న కుల గణన సర్వే ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ నరేష్ అన్నారు. బుధవారం ఎర్రవల్లి మండల పరిధిలోని జింకలపల్లిలో ఎన్యూమరేటర్లు చేస్తున్న కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేలో ఎన్యూమరేటర్లకు పూర్తి వివరాలను తెలిపి సర్వే విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో సర్వేలో పాల్గొన్న ఎంపీడీఓ తిరుపతన్న



మానవపాడులో ఎంపీడీవో భాస్కర్..



నక్కలపల్లిలో సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేందర్

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే ఉద్యమిస్తాం



పెద్దధన్వాడ వద్ద ధర్నా చేస్తున్న బీజేపి నాయకులు

రాజోళి: ఇథనాల్ ఫ్యాక్టరీ రాజోలి యాజమాన్యంతో అధికారులు కుమ్మక్కయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం మండలంలోని పెద్దధన్వాడ శివారులో ఫ్యాక్టరీ నిర్మించే ప్రదేశంలో ఆయన రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు ఉన్నాయని చెబుతున్న ఫ్యాక్టరీ యాజమాన్యం, ఆ అనుమతులతో ప్రజల ప్రాణాలు తీస్తారా అని ప్రశ్నించారు. చిన్న ధన్వాడ, పెద్ద ధన్వాడ గ్రామాల మధ్యనే ఉన్న ఈ ప్రదేశంలో ఫ్యాక్టరీ ఎలా నిర్మిస్తారన్నారు. 24 గంటలు జన సంచారం ఉండి, పశువులు, జంతువులు ఉండే దగ్గర ఇలాంటి ఫ్యాక్టరీని నిర్మిస్తే వచ్చే ప్రమాదాలను నివారించేది ఎవరని అన్నారు. ఫ్యాక్టరీ వ్యర్థాలు తుంగభద్ర నీటిలో కలిస్తే తాగునీరు, సాగునీరు కలుషితమై ప్రజలకు అనేక రకాల వ్యాధులు వస్తాయని, ఈ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని తక్షణమే నిలిపేయకపోతే ఉద్యమం తప్పదని ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని హెచ్చరించారు. ప్రజలు ఫ్యాక్టరీ వద్దని వ్యతిరేకిస్తున్నా.. అధికారులు స్పందించకపోవడం చూస్తే అధికారుల తీరుపై అనుమానాలు వస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంజీవ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ శర్మ,గోపాల కృష్ణ, భగత్ రెడ్డి, బీమన్న, మహేష్, తిరుపతి తదిదరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాలాధారులు అష్టోత్తరం, శరణు గోషలో పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠ ఉత్సవం



కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాలలో ఆంజనేయ స్వామి విగ్రహం, ధ్వజ స్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేదమంత్రాల నడుమ ఘనంగా ప్రతిష్ఠించారు. అంకురార్పణ హోమం, మహా పూర్ణహుతి నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రంజిత్‌కుమార్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న సురేష్

మల్దకల్: ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో పిరమిడ్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో ధ్యానం చేయించి, ధ్యానం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, వెంకటలక్ష్మీ, నీరజ, నర్సింహ్మాచారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అరెస్టు చేయడంలో నిర్లక్ష్యం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: మల్దకల్ మండల బిజ్వారానికి చెందిన మైనర్ బాలిక మృతి కారణమైన బండ్ల రాజశేఖర్ రెడ్డిపై కేసు నమోదై 15రోజులు అవుతున్నా పోలీసులు అతడిని అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని వివిధ సంఘాల నాయకులు మండిపడ్డారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బాలిక మృతికి కారణమైన బండ్ల రాజశేఖర్ రెడ్డిని వెంటనే అరెస్టు చేసి, మల్దకల్ ఎస్సైని సస్పెండ్ చేయాలన్నారు. ఈ నెల 8న జిల్లా కేంద్రంలోని పాత బస్టాండులో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జ్యోతి, సుభాన్, అచ్చన్న గౌడ్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ప్రభాకర్, వాల్మీకి, దానయ్య, వినోద్‌కుమార్, కోళ్ల ఉస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బండ్ల రాజశేఖర్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి..

మల్దకల్ మండలం బిజ్వారానికి చెందిన మైనర్ బాలిక మృతికి కారణమైన బండ్ల రాజశేఖర్ రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కురువ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రజలను, పోలీసులను, హైకోర్టును తప్పుదోవ పట్టించే విధంగా బాలికకి ఆమె తల్లిదండ్రులు బాల్య వివాహం చేయడానికి యత్నించడంతో ఆత్మహత్య చేసుకుందని హైకోర్టులో తప్పుడు ఆఫిడవిట్ సమర్పించాలని తెలిపారు. దీనిని ప్రజలు తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో చిన్నారులకు బుధవారం వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు హెల్త్ అసిస్టెంట్ శ్రీలక్ష్మి అన్నారు. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు టీకాలు ఎంతగానో ఉపయోగపడుతాయని, తల్లిదండ్రులు తమ చిన్నారులకు సమయానికి అనుగుణంగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించడం వలన చిన్నారులకు వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. గర్భిణులు కూడా సమయానికి వైద్య పరీక్షలు చేయించుకుంటూ సరైన పౌష్టికాహారం తీసుకోవాలని ఆమె సూచించారు.



కాంగ్రెస్ పార్టీలో మహిళలకు ప్రాధాన్యత



ధరూరులో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేటీదొడ్డి: కాంగ్రెస్ పార్టీ మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆనంద్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని కుచినెర్ల, పాతపాలెం గ్రామాల్లో అఖిల భారత మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మొబైల్ యాప్ ద్వారా మహిళలకు సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. మహిళల అభ్యున్నతికి పార్టీ తోడ్పాటు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో గోవింద్, విజేంద్ర, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ధరూరులో..

ధరూరు: మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ధరూరులో బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కురువ శ్రీనివాసులు, కపట్రాల వెంకట్‌రెడ్డి, చింతరేవుల సురేష్‌లు ప్రారంభించారు. మొబైల్ యాప్ ద్వారా మహిళల సభ్యత్వ నమోదుకు అపూర్వ స్పందన లభిస్తోందని, మహిళలు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి పనులు చూసి స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మద్దిలేటి, సవారన్న, మాల బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అలంపూర్: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటస్వామి అన్నారు. అలంపూర్ పట్టణంలో సైబర్ మోసాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కుటుంబ సమగ్ర సర్వే పేరుతో కొందరు సైబర్ మోసాలకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించే లింక్, మెసేజ్‌లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అప్రమత్తతతోనే సైబర్ మోసాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీలు విజయవంతం చేయాలి



గట్టులో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

గట్టు: తెలంగాణ నడిగడ్డ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే ఉపన్యాస పోటీలు విజయవంతం చేయాలని సంఘ జిల్లా అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీ నారాయణ కోరారు. బుధవారం గట్టులోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 11, 12 తేదీల్లో మండల స్థాయిలో, 13న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలైన విద్యార్థులకు నగదుతో పాటు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నల్లారెడ్డి, ఎస్‌టీఎఫ్ మీడియా ఇన్‌చార్జి రాజుసాగర్, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, వెంకటేష్, రమేష్, నర్సింహులుగౌడ్, నర్సింహులు, వీరేష్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలంపాడు పాఠశాల సందర్శించిన ఎంఈఓ



ర్యాలంపాడులో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: మండల పరిధిలోని ర్యాలంపాడు ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలతో మాట్లాడారు. విద్యార్థులకు అందించే భోజనం రుచితో పాటు శుచిగా ఉండాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్ నిర్మాణానికి విరాళం అందజేత



ఆలయంలో విరాళం అందజేస్తున్న భక్తులు

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలోని వెలసిన శ్రీపాగుంట లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి బుధవారం కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా గాజులపాడు గ్రామానికి చెందిన అనికెత్ రెడ్డి కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళం అందజేశారు. ఆలయ షెడ్ నిర్మాణం కోసం విరాళం అందజేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శేష వస్త్రాలతో వారిని సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావాలి



చేప పిల్లలు వదులుతున్న అధికారులు,నాయకులు

అయిజ: మండలంలోని బింగుదొడ్డి చెరువులో బుధవారం జిల్లా మత్స్య శాఖ జిల్లా అధికారిని షకీల బాను, అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న, వైస్ చైర్మన్ కుమార్ చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శేక్షవలి ఆచారి, దేవరాజు, మత్స్యకారుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ధర్మయుద్ధ మహాసభ జయప్రదం చేద్దాం

ఖిల్లాఘనపురం: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగలకు ద్రోహం చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గురువారం నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేద్దామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గౌరిపాగ లక్ష్మయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండానే ఉద్యోగాల భర్తి చేయడం వలన ఎంతో మంది దళితులకు అన్యాయం జరుగుతుందన్నారు. కమిటీ పేరుతో కాలయాపన చేయాలని ముఖ్యమంత్రి చూస్తున్నారని మండిపడ్డారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేపడతామని అసెంబ్లీలో చెప్పిన ముఖ్యమంత్రి రెండు నెలల్లోనే మాట మార్చడం సరైంది కాదన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే ఈ సభకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పానుగంటి మల్లేష్ మాదిగ, యాదయ్య మాదిగ, చంద్రయ్య మాదిగ, రాములు మాదిగ, బుచ్చయ్య మాదిగ, బంగారయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



డీడబ్ల్యూఓ లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వనపర్తి: అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని డీడబ్ల్యూఓ లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కంటే మెరుగైన పాలన ప్రజలకు అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. నవంబర్4న అంగన్‌వాడీ టీచర్లతో ఐసీడీఎస్ అధికారులు, మంత్రి ఆధ్వర్యంలో సచివాలయంలో చర్చలు జరిపినట్లుగా మీడియాలో వచ్చిందన్నారు. ఈ చర్చలకు అంగన్‌వాడీ టీచర్లు అండ్ హెల్పర్స్ యూనియన్‌లో పెద్ద సంఘమైన సీఐటీయూ యూనియన్‌ను ఆహ్వానించకపోవడం రాష్ట్ర ప్రభుత్వం యొక్క అప్రజాస్వామిక చర్యగా అభివర్ణించారు. తమ యూనియన్ తరపున అంగన్‌వాడీల సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, నందిమళ్ల రాములు, జిల్లా నాయకులు సుమతి, తస్లీమా, పుష్ప, అరుణ, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.